క్లుప్తంగా

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ ఇస్తున్న ట్రైనర్స్

పెంచికల్‌పేట్: నూతన జాతీయ విద్యావిధానంపై అంగన్‌వాడీ టీచర్లకు అందిస్తున్న శిక్షణ తరగతులను టీచర్లు సద్వినియోగం చేసుకోవాలని సిర్పూర్(టి) సీడీపీవో విజయలక్ష్మి కోరారు. రైతు వేదికలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ తరగతులను సోమవారం ఆమె ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు విద్యను అందించేందుకు శిక్షణ తరగతులు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ కరుణ, సూపర్‌వైజర్ హసీనా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సునీత

కెరమెరి: విద్యార్థులు అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలని షీ టీం ఇన్‌చార్జి సునీత అన్నారు. సోమవారం మండలంలోని గోయగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాట్లాడారు. మహిళల భద్రతే షీ టీం లక్ష్యమన్నారు. సెల్‌ఫోన్‌లకు వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆడే ప్రకాశ్, షీటీం సిబ్బంది సునీత, శ్రీలత, కెరమెరి హెచ్‌సీ మురహరి, పీసీ జంగు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన




వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

కౌటాల: కౌటాల మండల కేంద్రంలోని విశల్ మెడిక్యూర్ ఆసుపత్రిలో సోమవారం షణ్ముఖ మల్టీస్పెషలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. వైద్యులు ఉదయ్ సాగర్, తిరుమలేశ్, ఖాసీం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వారసంత వేలం

రెబ్బెన: గోలేటి గ్రామ పంచాయతీలో ప్రతీ గురువారం నిర్వహించే వారసంత 2024- 25 సంవత్సరానికి సంబంధించిన నిర్వహణ కోసం బుధవారం ఉదయం 10 గంటలకు పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి జలేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

కాగజ్‌నగర్ రూరల్: ప్లాస్టిక్ వినియోగంపై పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ఏకో క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత మాట్లాడుతూ పర్యావరణంపై అవగాహన కల్పించడం, సంస్కృతిని పెంపొందించడం ఏకో క్లబ్‌ల లక్ష్యమన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం ప్లాస్టిక్ వినియోగంపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణ, వసంత, స్వరూప, జయశ్రీ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో వివిధ గ్రూపులలో ఖాళీగా ఉన్న 32 సీట్లకు ఈనెల 26న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, బోనఫైడ్ జిరాక్స్ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

వన మహోత్సవానికి సిద్ధం



నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

- ప్రణాళికలు రూపొందించిన అధికారులు
- మొక్కల పంపిణీకి కసరత్తు

కాగజ్‌నగర్ రూరల్: వన మహోత్సవ కార్యక్రమం విజయవంతం చేసేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. ప్రతీ గ్రామపంచాయతీ పరిధిలో నర్సరీలను ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలు పెంచారు. జూలైలో నిర్వహించే వన మహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీలు ఉండగా.. ప్రతీ గ్రామ పంచాయతీలో సుమారు 10 వేల మొక్కలు నాటేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరో 25 వేల మొక్కలను రోడ్లకు ఇరువైపులా నాటేందుకు సన్నద్ధమవుతున్నారు.

రవాణా ఖర్చులు లేకుండా..

ఏ గ్రామ నర్సరీలో పెంచిన మొక్కలను ఆ గ్రామంలోనే నాటాలని అధికారులు నిర్ణయించారు. గతంలో కొన్ని గ్రామాలను కలిపి ఒక నర్సరీలో పెంచడంతో ఇతర పల్లెలకు వాటిని తరలించడంలో రవాణా ఖర్చులు పెరిగిపోవడం, ఇతరత్రా ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీలో నర్సరీని ఏర్పాటు చేసింది. పంచాయతీలకే నిర్వహణ బాధ్యతలు అప్పగించింది.

ప్రతీ ఇంటికి ఆరు మొక్కలు..

ప్రతీ ఇంటికి ఆరు మొక్కలను సరఫరా చేసేలా ప్రణాళికలు తయారు చేశారు. మూడు పూలమొక్కలతో పాటు మరో మూడు పండ్ల మొక్కలు పంపిణీ చేయనున్నారు. గులాబీ, మందారం, మల్లె, చామంతి, తదితర మొక్కలు ఇవ్వనున్నారు. అదేవిధంగా రోడ్ల వెంట నీడనిచ్చే టేకు, అడవి తంగెడు, జామ మొక్కలను నాటనున్నారు.

ఇంటింటికీ మొక్కలు అందిస్తాం



నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. వర్షాలు సమృద్ధిగా కురిసిన తర్వాత గుంతలు తీయించి నాటడం ప్రారంభిస్తాం. ప్రతి ఇంటికీ మొక్కలు చేరేలా చర్యలు తీసుకుంటున్నాం. పథకాన్ని విజయవంతం చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.

– రమేశ్, ఎంపీడీవో కాగజ్‌నగర్

వారసంత.. సమస్యల చింత



తిర్యాణి మండల కేంద్రంలోని వారసంత

- కనీస వసతులు కరువు
- ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో వారసంత
- పంచాయతీ ఆదాయానికి గండి

తిర్యాణి: వారానికి సరిపడ కూరగాయలు, నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు చిన్నచిన్న పట్టణంలో, మేజర్ గ్రామ పంచాయతీలల్లో సంత నిర్వహణను సంబంధిత గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. కాగా మండల కేంద్రంలో నిర్వహించే వారసంతకు ప్రతీ వారం వందల సంఖ్యలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు వచ్చి తామకు కావాల్సిన వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. క్షేత్రస్థాయిలో వారసంత ప్రైవేట్ స్థలంలో నడుస్తుండడంతో వ్యాపారులకు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

సాధారణంగా గ్రామ పంచాయతీకి ఇంటి పన్నులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులతో ఆయా గ్రామాలల్లో నిర్వహించే వారసంత ద్వారా అదనపు ఆదాయం వస్తుంది. కానీ మండల కేంద్రంలో అందుకు భిన్నమైన పరిస్థితి ఉండడంతో పంచాయతీ ఆదాయానికి గండి పడుతుంది. వారసంత ఏర్పాడి దాదాపు పదేళ్లు అవుతున్నా.. నేటికి సంత నిర్వహణకు అధికారులు ప్రభుత్వ స్థలంను చూపించకపోవడంతో ప్రవేటు వ్యక్తికి చెందిన స్థలంలోనే సంత నిర్వహిస్తున్నారు. సంబంధిత భూయాజమని సంతలో ఏర్పాటు చేసే ప్రతీ దుకాణం నుంచి రూ. 50 చొప్పున వసూలు చేస్తున్నారు. వారసంతో ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో వినియోగదారులు, వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. షెడ్లు లేకపోవడంతో వర్షంలో తడవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో వారసంత ఉండడంతో గ్రామపంచాయతీ ఏడాదికి దాదాపు 1 లక్ష రూపాయల వరకు ఆదాయం కోల్పోతుంది. ప్రస్తుతం సంత నిర్వహణ చేపడుతున్న స్థలాన్ని పంచాయతీ లీజుకు తీసుకొని కనీస వసతులు కల్పించాలని మండల వాసులు డిమాండ్ చేస్తున్నారు.

వసతులు కల్పించాలి



మండల కేంద్రంలో ప్రతీ శుక్రవారం నిర్వహించే వారసంతలో వినియోగదారులకు మౌలిక వసతులు కల్పించాలి. సంతను ప్రభుత్వం స్థలంలో నిర్వహించడం ద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం వస్తుంది. ఆ ఆదాయంతో సంతను అభివృద్ధి చేయాలి.

– గెడం సుభాశ్, తిర్యాణి

ఆరుగురిపై అట్రాసిటీ కేసు నమోదు



పోలీస్‌స్టేషన్‌లో బాధితులు

చింతలమానెపల్లి: మండలంలోని రుద్రాపూర్ గ్రామంలో జరిగిన వివాదంలో ఆరుగురిపై సోమవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ సాదిక్ పాషా తెలిపారు. రుద్రాపూర్ గ్రామానికి చెందిన కవ్వాల సాగర్, కవ్వాల సందీప్, కవ్వాల వినోద్, కుదురుపాక తిరుపతి, లెండుగురె సంఘ్‌దేవ్, గంగాపూర్ గ్రామానికి చెందిన డోకె శ్రీనివాస్‌లపై విచారణ జరుపుతున్నట్లు వివరించారు. రుద్రాపూర్ గ్రామానికి చెందిన బాధితులు దుర్గం సుగుణాకర్, పెరుగు లక్ష్మణ్, మోర్లె బాబూరావ్, కొట్రంగి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రాపూర్ వాగులో అక్రమంగా ఇసుక తవ్వుతున్నట్లు గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు రావడం ఆలస్యం కావడంతో 100కు సమాచారం అందించగా ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. ఈక్రమంలో ఇసుక తరలిస్తున్న పలు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. అనంతరం పోలీసులు గ్రామస్తులు దుర్గం సుగుణాకర్, పెరుగు లక్ష్మణ్, మోర్లె బాబూరావ్, కొట్రంగి శ్రీనివాస్‌లతో కలిసి వాగులో తవ్వకాలు జరుపుతున్న ప్రాంతానికి వెళ్లారు. అప్పటికే అక్కడ ఉన్న నిందితులు పోలీసుల ఎదురుగానే బాధితులపై దాడికి దిగారు. కులంపేరుతో దూషించారు. బాధితుల వద్ద నుంచి ఫోన్లను లాక్కుని ధ్వంసం చేశారు. అక్కడినుండి తప్పించుకున్న బాధితులు చింతలమానెపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. తమకు రక్షణ కల్పించాలని కోరారు. ఇసుక తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బీజేపీ నాయకుల ఆగ్రహం..

సమాచారం తెలుసుకున్న బీజేపీ జిల్లా కార్యదర్శి దోని శ్రీశైలం, బీజేపీ సీనియర్ నాయకులు పాల్వాయి సుధాకర్ రావు సోమవారం పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. బాధితులను పరామర్శించి సీఐ సాదిక్‌పాషాతో మాట్లాడారు. అక్రమాలను అడ్డుకుంటే దాడి చేయడం సరికాదన్నారు. పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇసుక అక్రమంగా రవాణను అరికట్టాలని కోరారు.

అధికారుల తీరుపై విమర్శలు..

రుద్రాపూర్ గ్రామంలో జరిగిన ఘటనలో అధికారుల తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రి సమయంలో అక్రమంగా ఇసుక తవ్వకాలపై గ్రామస్తులు ఫిర్యాదు చేసినా.. అధికారులు సకాలంలో స్పందించలేదని గ్రామస్తులు ఆరోపించారు. ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టుబడిన వదిలేశారని గ్రామస్తులు తెలిపారు. తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చినా పరిశీలించ లేదని, జేసీబీని సీజ్ చేశామని తహసీల్దార్ తప్పుడు సమాచారం ఇవ్వడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ప్రిన్సిపాల్

కెరమెరి(ఆసిఫాబాద్): సెప్టెంబర్‌లో నిర్వహించే అడ్వాన్స్ మౌంటరింగ్ కోర్స్ కోసం గిత్తె కార్తీక్‌కు తెలంగాణ మైనార్టీ రెసిడెన్సియల్ ఎడ్యూకేషన్ సొసైటీ కార్యదర్శి అయిషా మస్‌రత్ ఖానమ్ రూ. 30 వేలను మంజూరు చేశారు. ఈ మేరకు ఆయనకు చెన్నూర్ మైనార్టీ రెసిడెన్సియల్ కళాశాల ప్రిన్సిపాల్ మాలోత్ తిరుపతి సోమవారం రూ.30 వేల చెక్కు కార్తీక్‌కు అందజేశారు. కెరమెరి మండలంలోని కెలికే గ్రామానికి చెందిన కార్తీక్ ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. గత కొంత కాలంగా చేసిన సహసాలు చేసి బహుమతులు, పథకాలు సాధించారు.

ఎరువులు మహారాష్ట్రకు తరలిస్తే చర్యలు



వాహనాలు తనిఖీ చేస్తున్న ఏవో రామకృష్ణ

చింతలమానెపల్లి: రాష్ట్ర ఎరువులను మహారాష్ట్రకు తరలించి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి రామకృష్ణ హెచ్చరించారు. సోమవారం మండలంలోని గూడెంలోని ఎరువుల దుకాణాలను, సరిహద్దు వద్ద మహారాష్ట్రకు వెళ్తున్న వాహనాలను తనిఖీ చేశారు. రైతులకు కావాల్సిన విత్తనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. సాగులో సలహాలు, సూచనల కోసం వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

కాగజ్‌నగర్ రూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే హరీశ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. బకాయి పడిన సుమారు రెండు కోట్ల రూపాయలు ఇవ్వాలని, అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న ఎస్‌ఎంఆర్ కార్మికుల మూడు నెలల జీతాలు ఇవ్వాలని, పారిశుధ్య కార్మికులకు రెండు నెలల జీతాలు చెల్లించాలని నూతన 2వ పీఆర్‌సీలో కనీస వేతనం రూ. 26 వేలగా నిర్ణయించాలని, అదేవిధంగా కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు శంకర్, ఉపాధ్యక్షుడు మల్లేశ్, సంజీవ్, శంకరమ్మ, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

రాణి దుర్గావతి మహిళలకు ఆదర్శం



పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

జైనూర్: మొఘలుల సైన్యానికి ఎదురుతిరిగిన వీర నారి రాణి దుర్గావతి నేటి మహిళలకు ఆదర్శమని రాణి దుర్గావతి మహిళా ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ గోడం జంగుబాయి అన్నారు. రాణి దుర్గావతి వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని దుర్గావతి విగ్రహానికి పూలమాల వేసి ఆదివాసీ సంప్రదాయం ప్రకారం నివాళులర్పించారు. ఆదివాసీ అనుబంధ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గొడవలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయడంతోపాటు డీఎస్పీపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కొడప హన్నుపటేల్, మెస్రం రాహుల్, నాగోరావు, చహక్కటి గణేష్, కమలాబాయి, గేడం శంభు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పోస్టులు మంజూరు చేయాలి

కెరమెరి(ఆసిఫాబాద్): ఇంటర్ విద్యలో జిల్లా విద్యాధికారి పోస్టులు మంజూరు చేయాలని ఇంటర్‌బోర్డు కార్యదర్శి, డైరెక్టర్ శృతి ఓజాను తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం 475 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేశ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్, కుమురం భీం జిల్లా అధ్యక్షుడు నవీన్ రెడ్డి కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయంలో ఆమెను కలిసి వినతిప్రం అందజేశారు. వేసవి సెలవుల్లో ఎన్నికల విధులు నిర్వర్తించిన సిబ్బందికి ప్రొసిడింగ్ ఇప్పించాలని కోరారు.

నేడు అవగాహన సదస్సు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని రైతువేదికలో కొబ్బరి సాగుపైన మంగళవారం ఉదయం 10 గంటలకు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పెంచికల్‌పేట్ ఇన్‌చార్జి ఏడీఏ రాజులనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరిసాగుకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీ పథకాలను వివరించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన రైతులు అవగాహనకు హాజరు కావాలని కోరారు.

నేషనల్ హైవే పనులు పూర్తి చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ సంతోష్

రెబ్బెన: పెండింగ్‌లో ఉన్న నేషనల్ హైవే పనులను పూర్తి చేయాలని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో నేషనల్ హైవే సైట్ ఇంజనీర్ సంతోష్‌కు వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేషనల్ హైవే పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పనులన్ని పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నేషనల్ హైవేల అప్రోచ్ రోడ్లకు వెంటనే బీటీ వేయాలని, పుంజుమేరగూడ, నక్కలగూడ, ఇందిరానగర్, కొండపల్లి, నేర్పల్లి, తక్కళ్లపల్లి, పులికుంట బస్‌స్టాప్‌ల వద్ద బస్‌సెల్టర్లు నిర్మించాలని కోరారు. మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న సైడ్ డ్రైన్‌ను పూర్తి చేయాలని, ఫ్లైఓవర్ బ్రిడ్జిల అండర్‌పాస్‌లో నీరు చేరకుండా చర్యలు చేపట్టాలన్నారు. గంగాపూర్ కమాన్‌కు నష్టపరిహారం చెల్లించి తొలగించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బస్‌సెల్టర్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చిరంజీవిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల దోపిడీని అరికట్టాలని సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డీఈవో అశోక్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి సాయికృష్ణ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల్లో ఇష్టానుసారంగా ఫీజులు, టై, బెల్ట్, బుక్స్‌లను పాఠశాలలో అమ్ముతున్నారని ఆరోపించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం పేదలకు 20 శాతం ఉచిత విద్యను అందించాల్సి ఉన్న ఏఒక్క పాఠశాలలో అమలు కావడం లేదన్నారు. అర్హత లేని ఉపాధ్యాయులను నియమించి విద్యను అందిస్తున్నారని, సౌకర్యాలు లేక రేకుల షెడ్లు, తరగతి గదిలో సంఖ్యను మించి పిల్లలను కుర్చోపెట్టి బోధన సాగిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, సాయి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనులు దక్కేలా పోరాడుతాం



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

రెబ్బెన: రాష్ట్రంలోని బొగ్గు గనులు సింగరేణికే దక్కేలా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఐఎన్‌టీయూసీ పోరాడుతుందని బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ అన్నారు. సోమవారం బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీని సందర్శించి కార్మికులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరితో దేశంలోని బొగ్గు బ్లాకులను ప్రైవేటు పరం చేసేందుకు వేలం నిర్వహిస్తోందన్నారు. ఒకవేళ సింగరేణిని ప్రైవేట్ పరం చేయబోమంటూనే మరో వైపు రాష్ట్రంలోని బొగ్గు బ్లాకులను వేలం వేస్తోందన్నారు. బీజేపీ ప్రభుత్వ రెండు నాలుకల ధోరణి మూలంగా సింగరేణి మనుగడే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ నాయకులు ప్రకాష్‌రావు, సదాశివ్, ఏరియా నాయకులు, ఫిట్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

కైలాస్‌నగర్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ కోరారు. ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు రూ.18 వేలు, ఆయాలకు రూ.15 వేలు ఇవ్వాలన్నారు. గౌరవ వేతనం పొందుతున్న అంగన్‌వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షాకు అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజెంగుల రాజు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ధరణి ఛాయ, ప్రధాన కార్యదరి చంద్రకళ, రుక్మిణి, సుశీల, సంగీత, రాధ, నివేదిక, దుర్గా, భాగ్యరేఖ, చారులత పాల్గొన్నారు.

ఇసుక లారీల పట్టివేత



ఇసుక తరలిస్తున్న లారీలు

జైనూర్: చెన్నూర్ నుంచి ఆదిలాబాద్ వైపుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలు పోలీసులు పట్టుకున్నారు. జైనూర్ ఎస్సై సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం 6 గంటలకు జైనూర్ సీఐ అంజయ్య పోలీసు సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపుకు వెళ్తున్న రెండు ఇసుక లారీలు పట్టుకొని సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు.

రోడ్లపై పశువుల సంచారం



రోడ్డుపై పశువులు

దహెగాం: రోడ్లపై పశువులు సంచరించడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వీటివల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పశుపోషకులు పశువులను రోడ్లపై వదిలేయడంతో పంట పొలాలను నాశనం చేస్తాయని రైతులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి రోడ్లపైకి పశువులు రాకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.